**లంచగాండుల వివరాలు ఏసిబికి తెలపండి**

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఏసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్:(040) 2475132, 247456, 24745626



# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY
VOLUME: 16 ISSUE:152

తెలుగు దినపత్రిక


## ఫస్ట్...లాస్ట్...తెలంగాణనే

హైదరాబాద్, కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (ఖఉఎ) 2.0 నివేదికలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మిశ్రమ ఫలితాలను సాధించింది. ఓవరాల్ నేషనల్ ర్యాంకింగ్స్‌లో తెలంగాణ గణనీయమైన పురోగతిని సాధించి, గతంలో ఉన్న స్థానం నుంచి ఏకంగా 18వ స్థానానికి చేరింది. మొత్తం 1000 పాయింట్లకు గాను 599.7 స్కోరు సాధించి ప్రచేష్ట-3 బ్యాండ్‌లో నిలిచింది. స్కూళ్లకు విద్యార్థుల రాక , అడ్మిషన్ల ప్రక్రియలో సాధించిన ప్రగతి వల్లనే రాష్ట్రం ఓవరాల్ ర్యాంకింగ్‌లో పైకి ఎగబాకినట్లు ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.అయితే ర్యాంక్ మెరుగైనప్పటికీ అసలైన చదువుల నాణ్యతలో మాత్రం తెలంగాణ ఘోరంగా విఫలమైంది. విద్యార్థుల సామర్థ్యం, అధ్యయన ఫలితాలు.. అంటే లెర్నింగ్ ఔట్ కమ్ విభాగంలో రాష్ట్రం అత్యంత పేలవ ప్రదర్శన కనబరిచింది. ఈ విభాగానికి కేటాయించిన 240 మార్కులకు గాను తెలంగాణ కేవలం 69 మార్కులు (28.8%) మాత్రమే సాధించి, జాతీయ స్థాయిలో 26వ స్థానంలో నిలిచింది.


నల్లగొండ సంపుటి: 16 సంచిక :174 ఎడిటర్ : సయ్యద్ పాష తేది: శనివారం 25-07-2026 పేజీలు:4 వెల: 1.00


# కేటీఆర్ కు జన్మదిన కానుకగా సన్న బియ్యం పంపించిన కాంగ్రెస్!




హైదరాబాద్,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు జన్మదిన కానుకగా కాంగ్రెస్ పార్టీ సన్న బియ్యంను పంపించింది. ప్రజా పాలన ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి అన్న సన్న బియ్యం పేరుతో ప్యాక్ చేసిన 25కేజీల సన్న బియ్యం సంచిని రాపీడో సర్వీస్ ద్వారా కేటీఆర్ కు పంపించారు. రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయి కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దేశంలో సన్నబియ్యం ఇస్తున్న ఏకైక రాష్టం తెలంగాణ ప్రభుత్వం అని ఈ సందర్బంగా సాయికుమార్ గుర్తు చేశారు.ఒకప్పుడు సన్నబియ్యంతో వంట చేస్తే పండగ అనుకునేవారని, రేవంత్ రెడ్డి ఇప్పుడు తెలంగాణాలో ప్రతి ఇంట్లో పండగ రోజుల చేస్తున్నాడన్నారు. కేటీఆర్ నిరుపేద కుటుంబం ఇంటిలోకి వెళ్లి సన్న బియ్యంతో భోజనం చేసినందుకు ధన్యవాదాలు చెబుతున్నామని, కేటీఆర్ పుట్టినరోజు కానుకగా 25 కేజీల సన్న బియ్యం పంపిస్తున్నామని తెలిపారు. ప్రతి నెల పంపిడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.ఈ ప్రజా ప్రభుత్వంలో అందరు సన్న బియ్యంతో భోజనం చేస్తున్నారని, నిరుపేద కుటుంబం కళ్ళలో ఆనందం చూడటమే మా ప్రభుత్వం లక్ష్యం అన సాయికుమార్ పేర్కొన్నారు. ఈ సన్న బియ్యం అన్ని పార్టీల వారు, ఉన్నవాళ్లు లేనివాళ్లు అందరు తినొచ్చు అని, మా ప్రభుత్వం సంక్షేమ పథకాల సునామీ అని, దేశంలో ఎక్కడ ఇలాంటి పథకాలు లేవు అన్నారు.

ఇందిరా పార్కు వద్ద కేటీఆర్ వర్సెస్ కాంగ్రెస్

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'నీట్'పరీక్షల్లో జరిగిన అక్రమాలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జ్‌ను ఖండిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శుక్రవారం ఇందిరా పార్కు వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్వీ నాయకులతో కలసి ధర్నాకు హాజరయ్యారు. అయితే బీఆర్ఎస్ ఆందోళనను అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దిగడంతో ఇందిరా పార్క్ పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ నిరసనను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గతంలో వారు అధికారంలో ఉన్నప్పుడు ఓ విద్యార్థిని మరణంపై అత్యంత అనుచితంగా మాట్లాడారని ఆరోపించారు. సమస్య తీవ్రతను పక్కనపెట్టి, సదరు అమ్మాయి లవ్ ఎఫైర్ వల్లే చనిపోయిందంటూ కేటీఆర్ ఎద్దేవా చేయడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ప్రజలు, విద్యార్థులు తమ హక్కుల కోసం ఆందోళనలు చేయకుండా 'ధర్నా చౌక్'ను ఎత్తివేశారని గుర్తుచేశారు. నేడు అదే ధర్నా చౌక్‌లో కేటీఆర్ రాజకీయ స్వార్థం కోసం నిరసనలు తెలపడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలకు, విద్యార్థులకు కేటీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పిన తర్వాతే ధర్నా చౌక్‌లో అడుగుపెట్టాలని అంజన్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారున. తెలంగాణప్రత్యేక వార్తలు

విద్యార్థుల నిరసనలో రాజకీయ అజెండాలు సరికాదు: కేటీఆర్

ఢిల్లీలో జరుగుతున్న విద్యార్థుల నిరసన కార్యక్రమాన్ని రాజకీయ అజెండాలతో మలినం చేయొద్దని బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ కోరారు. శుక్రవారం ఇందిరాపార్కు వద్ద జరిగిన బీఆర్ఎస్ నిరసన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. ఢిల్లీలో పార్టీలకతీతంగా నిరసనలు జరుగుతున్నాయని, దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారని, ఢిల్లీలో విద్యార్థులపై దాడులు చూస్తే బాధేస్తోందని, అందుకే వారికి అండగా ఉండేందుకే నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. అన్యాయం జరిగిన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే కాంగ్రెస్ ఎందుకు అడ్డుపడుతుందంటూ ప్రశ్నించారు.

# పార్టీ మారుతున్నారనే వార్తల పై మల్లారెడ్డి క్లారిటీ



హైదరాబాద్, తన రాజకీయ భవిష్యత్తు మరియు పార్టీ మార్పుపై గత కొన్ని రోజులుగా వస్తున్న ప్రచారాలకు బిఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మరోసారి ముగింపు పలికారు. తాను ఏ పార్టీలోకి మారడం లేదని, జీవితాంతం బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతానని ఆయన నొక్కి చెప్పారు. హైదరాబాద్ బోయిన్‌పల్లిలో ఘనంగా నిర్వహించిన కేటీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఆయన, కేటీఆర్ భవిష్యత్తుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ 125 సంవత్సరాల పాటు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, త్వరలోనే ఆయన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేటీఆర్ నాయకత్వంపై, బీఆర్ఎస్ సిద్ధాంతాలపై తనకు ఉన్న పూర్తి నమ్మకాన్ని మల్లారెడ్డి పునరుద్ఘాటించారు.

కార్యకర్త రక్తపు లేఖపై భావోద్వేగం: త్వరలోనే కలుస్తానని ప్రకటన

కేటీఆర్ బర్త్‌డే వేడుకల సందర్భంగా విలేకరులతో మాట్లాడిన మల్లారెడ్డి, ఒక అభిమాని రాసిన లేఖను గుర్తు చేసుకుంటూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఒక పార్టీ కార్యకర్త తనపై ఉన్న అభిమానంతో సొంత రక్తంతో రాసిన లేఖ తనను ఎంతగానో కలచివేసిందని తెలిపారు. పార్టీ శ్రేణులు మరియు కార్యకర్తలు తనపై చూపిస్తున్న ఈ తరహా నిష్కల్మషమైన ఆప్యాయత, అభిమానమే తనకు కొండంత బలాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. రక్తంతో లేఖ రాసి తనపై ప్రేమాభిమానాలు చాటుకున్న ఆ కార్యకర్తను త్వరలోనే స్వయంగా కలిసి అభినందిస్తానని, ఆయనకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మల్లారెడ్డి హామీ ఇచ్చారు.

# హైడ్రాకు హైకోర్టులో మొట్టికాయలు..మరోసారి రంగనాథ్‌పై ఆగ్రహం

హైదరాబాద్,హైడ్రా పనితీరుపై హైకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. మల్కాజ్‌గిరి పరిధిలోని లోతుకుంట భూములపై హైకోర్టులో మరోసారి విచారణ చేపట్టింది. ఒకే పిటిషన్‌లో మూడుసార్లు కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడం చరిత్రలో ఇదే మొదటిసారి అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులపై అప్పీల్ చేయకుండా మళ్లీ అదే భూమిలోకి వెళ్లడం తీవ్ర నేరమని హెచ్చరించింది. సదరు భూమిలో ఆర్మీ రక్షణ ఏర్పాటు చేయాలన్న ఉత్తర్వులను హైకోర్టు వెనక్కి తీసుకుంది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలతో కూడిన అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది.




# ప్రధాన్ రాజీనామాపై పార్లమెంట్‌లో ప్రతిష్టంభన

న్యూఢిల్లీ,కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పలు ప్రతిపక్ష పార్టీల నేతలు శుక్రవారం పార్లమెంట్ భవన ప్రాంగణంలో నిరసన చేపట్టారు. పార్లమెంట్ ఉభయ సభల్లో పేపర్ లీక్ అంశంపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. నీట్ యూజీ సహా దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న పరీక్షల పేపర్ లీక్ వ్యవహారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో తీవ్ర దుమారానికి దారితీసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం సహా ప్రధాని నరేంద్ర మోదీ సభాముఖంగా క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. ఈ అంశంపై చర్చకు ముందుగా మంత్రి ప్రధాన్ తప్పనిసరిగా రాజీనామా చేయాల్సిందేనని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు.ఈ మేరకు శుక్రవారం పార్లమెంట్ ప్రాంగణంలోని మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు నిరసన చేపట్టారు. 'ప్రధాన్‌ను తొలగించాలి' అనే బ్యానర్లతో నినాదాలు చేశారు. లోక్‌సభ, రాజ్యసభల్లో పేపర్ లీక్‌లపై చర్చ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో లోక్‌సభ ప్రారంభమైన కొద్దిసేపటికే మధ్యాహ్నం 12:00 గంటల వరకు వాయిదా పడింది. అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగింది. మరోవైపు.. పరీక్షల పేపర్ లీకేజీలను అరికట్టేందుకు కఠిన శిక్షలు విధించేలా కొత్త బిల్లును తీసుకొస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తుది రూపుదిద్దిన తర్వాత ఆ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడతామన్నారు. ఈ విషయమై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. నీట్ అంశంపై సభలో చర్చ జరగాల్సిన అవసరముం దన్నారు. మరోవైపు.. విద్యార్థులపై జులై 20న జరిగిన పోలీస్ చర్యలో పెల్లెట్ గన్స్ వినియోగించారని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. ఈ అంశాన్నీ పార్లమెంట్‌లో లేవనెత్తనున్నట్లు పార్టీ రాజ్యసభ ఉపనేత సాగరికా ఘోష్ వెల్లడిం చారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని



డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో స్పీకర్.. లోక్‌సభను సోమవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలో వందేమాతరం బిల్లు..

వందేమాతరం గేయానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం రాజ్యసభలో 'వందేమాతరం బిల్లు'ను ప్రవేశపెట్టింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ సభలో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ గేయాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించే వారికి జైలుశిక్ష సహా ఇతర శిక్షలు విధించేలా, అలాగే గేయాన్ని పూర్తిగా ఆలపించాల్సిందేననే నిబంధనలనూ ఇందులో పొందుపరిచారు. అయితే.. ఈ బిల్లుపై విపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలుపుతూ సభలోనే ఆందోళనకు దిగారు. బిల్లు వ్యక్తిగత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో సభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రాజ్యసభ కార్యకలాపాలను సభాపతి సోమవారానికి వాయిదా వేశారు.

**మాల్దా బీఎస్ ఎఫ్ క్యాంపులో కాల్పుల కలకలం..**

కోల్ కతా,పశ్చిమ బెంగాల్ లోని మాల్దా జిల్లా బంగ్లా దేశ్ సరిహద్దు బీఎస్ఎఫ్ క్యాంపులో కాల్పుల కలకలం రేపింది. తోటి జవాన్లపై బీఎస్ఎఫ్ జవాన్ విచక్షణా రహితంగా కాల్పులు జరిపాడు.

# ఢిల్లీలో విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో దాడి.. కేంద్రంపై రెచ్చిపోయిన రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ,నీట్ ప్రశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై కేంద్ర భద్రతా దళాలు పెల్లెట్ గన్లు,లాఠీఛార్జ్ ఉపయోగించడాన్ని కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా నిరసించారు. పోలీసుల దాడిలో గాయపడిన విద్యార్థులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిభావంతులైన విద్యార్థులపై పోలీసులు సాగించిన దమనకాండలో 19 ఏళ్ల సాహిల్ అనే విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడని రాహుల్ తెలిపారు. "చేతిలో జాతీయ జెండా పట్టుకుని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సాహిల్ అనే విద్యార్థిపై పెల్లెట్ గన్‌తో కాల్పులు జరిపారు. ఆ పెల్లెట్ తగలడంతో అతని ఒక కన్ను తీవ్రంగా దెబ్బతిన్నది. మళ్లీ చూపు వస్తుందో లేదో కూడా వైద్యులు చెప్పలేకపోతున్నారు అని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో నిరసనకారులపై పెల్లెట్ల గన్లు ఉపయోగించడం అత్యంత అరుదైన, దారుణమైన ఘటన అని పేర్కొన్నారు.

రాహుల్ గాంధీ డిమాండ్లు..

బాధిత విద్యార్థుల తరఫున రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వం ముందు మూడు స్పష్టమైన డిమాండ్లను ఉంచారు. నీట్ పేపర్ లీకేజీకి కారణమైన అధికారులను వెంటనే విధుల్లోంచి తొలగించాలి. విద్యార్థులపై లాఠీఛార్జ్, పెల్లెట్ గన్లతో దాడులకు తెగబడిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థులపై జరిగిన ఈ దమనకాండకు బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ దేశ యువతకు, విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

రెండు డిమాండ్లకు కేంద్రం అంగీకారం..

మరోవైపు, రాజ్యాంగ క్లబ్‌లో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో సీజేపీ ప్రతినిధులు దాదాపు రెండు గంటల పాటు చర్చలు జరిపారు. ఈ సమావేశం అనంతరం సీజేపీ జాతీయ ప్రతినిధులు మాట్లాడుతూ.. తమ రెండు కీలక డిమాండ్లకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందని వెల్లడించారు. నీట్ లీకేజీ వల్ల మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు 1కోటి పరిహారం అందించడం, ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన కేసులు ఉపసంహరించుకోవడం వంటి వారికి సూత్రప్రాయంగా అంగీకరించిందని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్లపై ఆలోచించడానికి ప్రభుత్వం సమయం కోరిందని, మలివిడత చర్చలు శనివారం జరగనున్నాయని సీజేపీ ప్రతినిధులు తెలిపారు.

# ఉద్యోగ,ఉపాధికి దగ్గరగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జులై 24: క్యూర్ పరిధిలో చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు(శుక్రవారం) సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్(ఓఆర్ఆర్) లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను గృహ నిర్మాణం కోసం వినియోగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.మొదటి విడతలో 17 నియోజకవర్గాల్లో మొత్తం 7,680 ఇందిరమ్మ ఫ్లాట్లను నిర్మించనున్నట్లు సీఎం వెల్లడించారు. 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం జరుగనుందన్నారు. ఒక్కో ఫ్లాట్ నిర్మాణానికి సుమారు రూ.11 లక్షల వ్యయం అవుతుందని, ఇందులో ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుందని చెప్పారు. భూమి వ్యయాన్ని(ల్యాండ్



కాస్ట్) పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. ఖాళీ ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు నగరానికి చేరువలోనే గృహాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

# సీజేపీ ప్రతినిధులతో ముగిసిన కేంద్రం చర్చలు.. రాజీనామాకే పట్టు!

న్యూఢిల్లీ,దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న 'నీట్' పరీక్షాపత్రాల లీకేజీ, విద్యావ్యవస్థలో సంస్కరణల వివాదంపై కేంద్ర ప్రభుత్వానికి, కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులకు మధ్య జరిగిన కీలక చర్చలు ముగిశాయి. కాన్స్టిట్యూషన్ క్లబ్ వేదికగా సుమారు గంటన్నరకు పైగా సాగిన ఈ భేటీ అత్యంత ఉత్కంఠ వాతావరణంలో సాగింది. ఈ సమావేశం ముగిసిన అనంతరం కేంద్రమంత్రులు, సీజేపీ ప్రతినిధులు కాన్స్టిట్యూషన్ క్లబ్ నుంచి బయటకు వెళ్లారు.

ప్రభుత్వానికి సీజేపీ లిఖితపూర్వక ప్రతిపాదనలు

ఈ చర్చల్లో ప్రభుత్వం తరఫున కేంద్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర సహాయ మంత్రి జితేందర్ సింగ్ హాజరవ్వగా.. సీజేపీ తరఫున సీనియర్ ప్రతినిధి సౌరవ్ దాస్ నాయకత్వంలోని బృందం పాల్గొన్నారు. చర్చల సందర్భంగా నీట్ పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, పేపర్ లీకేజీలు, విద్యావ్యవస్థలో నెలకొన్న పలు లోపాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ మేరకు సీజేపీ తరఫున కేంద్ర ప్రభుత్వానికి లిఖితపూర్వక ప్రతిపాదనలను సమర్పించారు.

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సీజేపీ పట్టు!

ఈ సమావేశంలో సీజేపీ ప్రధానంగా పలు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచింది. నీట్ పేపర్ లీకేజీ, విద్యా వ్యవస్థ వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని సీజేపీ తీవ్రంగా పట్టుబట్టింది. బాధిత విద్యార్థుల కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని, విద్యాశాఖలో పారదర్శకత పెంచేలా సమూల సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే నీట్ పేపర్ లీక్ తో ఆత్మహత్య చేసుకున్నవారి కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలని, విద్యార్థులపై ఎఫ్ఐఆర్ లు



నమోదు చేయకూడదని డిమాండ్ చేశారు. సీజేపీ సమర్పించిన ప్రతిపాదనలపై స్పందించిన కేంద్రమంత్రి జేపీ నడ్డా.. ఈ అంశాలను ఉన్నత స్థాయిలో చర్చించి, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే.. మంత్రి రాజీనామా డిమాండ్, ఇతర అంశాలపై స్పష్టమైన హామీ లభించే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని సీజేపీ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

అధికారిక ప్రకటనపై ఆసక్తి

ఈ సమావేశంలో జరిగిన చర్చలపై కేంద్ర ప్రభుత్వం లేదా సీజేపీ తరఫున ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. అయితే విద్యా వ్యవస్థలో సంస్కరణలు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సంబంధించి మరిన్ని చర్చలు కొనసాగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. నీట్ వివాదంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

# స్థానిక ఎన్నికల్లో వైసీపీకి చావుదెబ్బ.. కూటమి ప్లాన్ అదుర్స్



విజయవాడ, కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. స్థానిక ఎన్నికల నిర్వహణకు సిద్ధపడుతోంది. సాధారణంగా పంచాయితీ ఎన్నికలు అనేవి ముందుగా జరపడం సహజం. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం మున్సిపల్ ఎన్నికల వైపు మొగ్గు చూపింది. ముందుగా పట్టణాల్లో ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించింది. దీని వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. 100కు పైగా మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్లను కైవసం చేసుకుని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని కోలుకోలేని దెబ్బతీయాలన్నది కూటమి ప్రణాళికగా తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాలతో పోల్చుకుంటే పట్టణ ప్రాంతాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చాలా బలహీనంగా ఉంది. అందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చావు దెబ్బ తీసేందుకు ముందుగా మున్సిపల్ ఎన్నికల వైపు కూటమి అడుగులు వేస్తోంది. మున్సిపల్ ఎన్నికల తర్వాత ప్రాదేశిక.. చివరిగా పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలన్నది ప్రణాళికగా తెలుస్తోంది.పట్టణాల్లో విద్యాధికులు, ఉద్యోగ ఉపాధ్యాయులు అధికంగా ఉంటారు. అయితే వారిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల ఒక రకమైన వ్యతిరేక భావన ఉంది. పైగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విధానాలు కూడా పట్టణ ప్రాంత ప్రజలకు నచ్చడం లేదు. ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రకటనలు కూడా మింగుడు పడడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో గతంలో సంక్షేమ పథకాలు అమలు చేయడం వంటి కారణాలతో వైసిపికి ఓటు బ్యాంకు స్థిరంగా ఉంది. ఆపై స్థానిక సంస్థలకు సంబంధించిన ప్రజాప్రతినిధులు ఇటీవల వరకు కొనసాగారు. వారు పట్టు నిలుపుకుంటూ వచ్చారు. అందుకే ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహిస్తే కూటమికి కాస్త ఇబ్బందికరంగా ఉండే అవకాశం ఉంది. పైగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలు అనే మాట ఉండకూడదు అని జగన్ సొంత పార్టీ క్యాడర్ను హెచ్చరించారు. అలా చేస్తే పార్టీ నియోజకవర్గ బాధ్యతలను మార్చేస్తానంటూ ఇంచార్జ్లను హెచ్చరించారు. అందుకే ముందుగా మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించి తర్వాత మిగతా స్థానిక సంస్థలకు నిర్వహించాలన్నది కూటమి ప్రభుత్వ ఆలోచనగా అర్థం అవుతుంది.పట్టణాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉండడంతో ఆ పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు రావడం ఖాయం. పైగా మూడు పార్టీల కలయికతో కూటమి దూకుడుగా ఉంటుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో జత కలిపేందుకు ఏ పార్టీ ముందుకు రాదు. పైగా మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ అనుసరించిన తీరు ఆ పార్టీ శ్రేణులకు తెలుసు. అధికార పార్టీ ఎలాంటి దూకుడు కనబరుస్తుందో ఆ పార్టీకి తెలియంది కాదు.. అందుకే ముందుగా మున్సిపల్ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని చావు దెబ్బ కొట్టి.. మిగతా ప్రాదేశిక ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోంది కూటమి. చివరిగా గ్రామీణ ప్రాంతాలకు ప్రతీకలుగా నిలిచే పంచాయితీలను ఏకపక్షంగా గెలుచుకొని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పుంజుకునే పరిస్థితి లేకుండా చేయాలన్నది కూటమి ఆలోచన. అందుకే ముందుగా మున్సిపల్ ఎన్నికల వైపు ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్ నుంచి డిసెంబరు లోపు మొత్తం స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలన్నది ప్రభుత్వ ఆలోచనగా అర్థం అవుతుంది. చూడాలి మరి ఏం జరుగుతుందో??

# మారని ట్రంప్...భారత్ పై మళ్లీ టారిఫ్



న్యూఢిల్లీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పని చేశారు. భారత్ సహా మరో 16 దేశాలపై కొత్త అదనపు సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. కార్మికుల వెట్టిచాకిరీతో తయారైన ఉత్పత్తుల దిగుమతులపై నిషేధం అమలుకు సంబంధించిన విచారణ అనంతరం అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. భారత్ ఇప్పటికే విదేశీ వాణిజ్య విధానాన్ని సవరించినందుకు 12.5 శాతానికి బదులుగా 10 శాతం టారిఫ్స్ మాత్రమే విధించింది.భారత్- అమెరికా మధ్య ఒకవైపు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. అమెరికా మధ్యలోనే ఒక షాకింగ్ నిర్ణయం తీసుకుంది. భారత్ సహా మరో 16 దేశాల నుంచి దిగుమతి అయ్యే కొన్ని ఉత్పత్తులపై 10 శాతం అదనపు సుంకాల్ని విధిస్తున్నట్లు ప్రకటించింది. కార్మికుల బలవంతపు శ్రమతో (వెట్టిచాకిరి) తయారైన ఉత్పత్తుల దిగుమతుల్ని అడ్డుకునే నిబంధనల అమలుపై జరిపిన విచారణ అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ వెల్లడించింది. ఈ సుంకాల గురించి యూఎస్ ప్రెసిడెంట్ ఎప్పటి నుంచో బెదిరిస్తూ వస్తుండగా తాజాగా వాటిని అమల్లోకి తెచ్చారు.అమెరికా ట్రేడ్ యాక్ట్ సెక్షన్ 301 కింది విచారణ చేపట్టింది. కార్మికుల వెట్టిచాకిరీతో తయారైన వస్తువుల దిగుమతుల్ని నిషేధించే చట్టాల్ని ఆయా చట్టాలు అమలు చేస్తున్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించింది. విచారణ అనంతరం నిషేధ నిబంధనలు అమలు చేసిన లేదా చేస్తామని హామీ ఇచ్చిన దేశాలకు 10 శాతం, అలాంటి చర్యలు తీసుకోని దేశాలకు 12.5 శాతం సుంకాల్ని విధించాలని నిర్ణయించింది.జూన్ 14న భారత్ తన విదేశీ వాణిజ్య విధానంలో మార్పులు చేసింది. కార్మికుల బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతుల్ని నిషేధించే నిబంధనల్ని చేర్చింది. దీంతో అమెరికా మొదట ప్రతిపాదించిన 12.5 శాతం అదనపు సుంకాలకు బదులు భారత్‌పై తగ్గించి 10 శాతం విధించింది. భారత్‌తో పాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, కంబోడియా, యూకే ఇలా మొత్తం 17 దేశాలపై 10 శాతం అదనపు సుంకాలు అమలు చేయనున్నట్లు అమెరికా స్పష్టం చేసింది.ప్రస్తుతం ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందంపై తొలి దశ చర్చలు జరుగుతున్నాయి. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ జేమిసన్ గ్రీర్‌తో సమావేశమయ్యారు. ఒప్పందానికి సంబంధించి ప్రాథమిక రూపురేఖలు ఇప్పటికే ఖరారైనట్లు సమాచారం. వీలైనంత త్వరలోనే ఈ ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.'కార్మికుల వెట్టిచాకిరీతో తయారైన వస్తువులపై చర్యలు తీసుకుంటున్న దేశాల్ని స్వాగతిస్తున్నామని' యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ జేమిసన్ గ్రీర్ చెప్పారు. ఈ చర్యల ద్వారా మానవ హక్కుల పరిరక్షణతో పాటు అంతర్జాతీయ వాణిజ్యంలో సమాన అవకాశాలు కల్పించాలనేది తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం విధించిన అదనపు టారిఫ్స్ 10 శాతానికి పరిమితమైనప్పటికీ అమెరికా మార్కెట్‌కు ఎగుమతి చేసే కొన్ని రంగాలపై అదనపు వ్యయభారం పడే అవకాశం ఉంది. ఇప్పటికే సుంకాలు అమల్లో ఉండగా.. ఎంపిక చేసిన వస్తువులపై ఈ అదనపు సుంకాల భారం పడనుంది. అయితే వాణిజ్య ఒప్పందం కుదిరితే భవిష్యత్తులో ఈ సుంకాల భారం తప్పే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

# హరీష్ ఇంపాక్ట్ ...పాదయాత్రలో తగ్గని క్రేజ్



మెదక్, తెలంగాణ రాజకీయాల్లో ట్రబుల్ షూటర్ గా, గ్రౌండ్ లెవల్ మాస్ లీడర్‌గా చెరగని ముద్ర వేసుకున్న మాజీ మంత్రి హరీష్ రావు వైఖరి ఇప్పుడు గులాబీ శ్రేణుల్లోనే కాకుండా, ప్రత్యర్థి వర్గాల్లోనూ తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. సిద్దిపేట జిల్లా మండల స్థాయిలో హరీష్ రావు చేపట్టిన 15 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రకు రైతులు, ప్రజల నుంచి ఊహించని స్థాయిలో అపూర్వ స్పందన లభించింది. కాళేశ్వరం పంపులను వెంటనే ప్రారంభించి, గొదావరి జలాలతో రంగనాయక సాగర్‌ను నింపాలని డిమాండ్ చేస్తూ ఆయన నిర్వహించిన ఈ యాత్ర.. కేవలం ఒక మండల స్థాయి నిరసనలా కాకుండా, ఒక రాష్ట్ర స్థాయి ప్రజా ఉద్యమాన్ని తలపించేలా జనసందోహాన్ని ఆకర్షించింది.కేవలం ఒక మండల స్థాయిలోనే హరీష్ పిలుపునకు ఈ స్థాయిలో జనం తరలివస్తే.. ఒకవేళ ఇదే పాదయాత్రను ఆయన నియోజకవర్గ స్థాయికో లేక రాష్ట్ర స్థాయికో విస్తరిస్తే ఉండే మాస్ ఇంపాక్ట్ ఎలా ఉంటుందనే చర్చ పొలిటికల్ సర్కిళ్లలో గట్టిగా నడుస్తోంది. సోషల్ మీడియా బిల్డప్‌లు, పెయిడ్ ప్రచారాల కంటే క్షేత్రస్థాయిలో ప్రజలతో ఉండే లైవ్ కనెక్టివిటీయే నాయకుడి అసలైన బలం అని హరీష్ రావు మరొకసారి నిరూపించారు. బీఆర్ఎస్ ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత చాలామంది కీలక నేతలు వ్యూహాత్మక మౌనం దాల్చినా , సోషల్ మీడియా వేదికలకే పరిమితమైనా.. హరీష్ రావు మాత్రం రోడ్డెక్కి రైతు సమస్యలపై, ప్రభుత్వ వైఫల్యాలపై క్షేత్రస్థాయి పోరాటానికే ప్రాధాన్యత ఇస్తున్నారుఅయితే, హరీష్ రావు ఏం చేసినా సరే ఆయన చుట్టూ రకరకాల రాజకీయ ఊహాగానాలు, అంతర్గత సమీకరణల ప్రచారాలు ముసురుకోవడం పరిపాటిగా మారింది. ప్రజాక్షేత్రంలో ఆయన చురుగ్గా ఉంటూ భారీగా జనాన్ని సమీకరిస్తే.. పార్టీతో సంబంధం లేకుండా సొంత ఇమేజ్, పర్సనల్ బ్రాండ్ పెంచుకోవడానికి యత్నిస్తున్నారు అని సొంత పార్టీలోని కొందరు వ్యతిరేక వర్గీయులు ముద్రవేసే యత్నం చేస్తారు. అదే సమయానికి ఆయన కొద్దిరోజులు సైలెంట్‌గా ఉంటే.. పార్టీ నాయకత్వంపై అలిగారు, విముఖతతో ఉన్నారు అంటూ ప్రత్యర్థులు ప్రచారం మొదలుపెడతారు. ఈ రెండింటి మధ్య హరీష్ రావు సమన్వయం పాటిస్తూ, తన పని తాను చేసుకుపోతుండటం ఆయన పరిణతికి నిదర్శనంహరీష్ రావు అంతర్గత వ్యూహాలు ఎప్పుడూ అంత సులభంగా బోధపడవు. ఒకవేళ హరీష్ రావు ఆలోచన ధోరణిలో చిన్నపాటి మార్పు వచ్చినా లేదా ఆయన వేరే రాజకీయ ఆలోచనల్లో ఉన్నారనే అనుమానం బీఆర్ఎస్ హైకమాండ్‌కు వస్తే.. అది కేవలం ఆ పార్టీలోనే కాక మొత్తం తెలంగాణ రాజకీయ యవనికపైనే ఒక భారీ పొలిటికల్ పెను భూకంపం సృష్టిస్తుందనడంలో సందేహం లేదు. గులాబీ దళంలో అత్యంత కేడర్ బేస్, మాస్ అప్పీల్ ఉన్న నేత కావడంతో.. ఆయన ప్రతి కదలికపై ప్రగతి భవన్ నుంచి ఫామ్‌హౌస్ వరకు, గజ్వేల్ నుంచి సిద్దిపేట వరకు నిరంతరం నిఘా మరియు చర్చ నడుస్తూనే ఉంటాయి. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతుల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తిని, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను ఆయుధంగా మలుచుకోవడంలో హరీష్ రావు సక్సెస్ అవుతున్నారు. పార్టీ పదవుల హోదా కంటే, ప్రజల్లో తనకున్న అసలైన గ్రౌండ్ పవర్ ఏంటో నిరూపించుకోవడానికే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారు. సిద్దిపేట పాదయాత్ర ద్వారా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వానికే కాదు, సొంత పార్టీలోని తన వ్యతిరేకులకు కూడా స్పష్టమైన సంకేతాలు పంపారని భావించవచ్చు. మాస్ లీడర్‌షిప్‌కు ప్రత్యామ్నాయం లేదని ఆయన క్షేత్రస్థాయి ఫలితాల ద్వారా చాటిచెబుతున్నారు.వూహాగానాలు, రాజకీయ విమర్శలను ఏమాత్రం పట్టించుకోకుండా హరీష్ రావు తన సొంత శైలిలోనే రైతు పోరాట బాట పట్టారు. రాబోయే రోజుల్లో ఈ పాదయాత్రలను ఇతర నియోజకవర్గాలకు విస్తరిస్తే, అది బీఆర్ఎస్ పార్టీకి ప్రధాన పునరుత్తేజంగా మారే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రజాదరణను పార్టీ నాయకత్వం ఎలా స్వీకరిస్తుంది, హరీష్‌ను ఏ రకంగా ముందుకు నడిపిస్తుంది అనేదానిపైనే బీఆర్ఎస్ భవిష్యత్ రాజకీయ వ్యూహాలు , తెలంగాణ రాజకీయ సమీకరణలు ఆధారపడి ఉన్నాయి.

# అర్థం కానీ జగన్ వ్యూహం...



కడప, దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వర్సెస్ ఇండియా కూటమి ప్రతిపక్షాల నడుమ తీవ్రమైన రాజకీయ పోలరైజేషన్ నడుస్తోంది. నీట్ క్వశ్చన్ పేపర్ లీకేజీ వ్యవహారం నుంచి పార్లమెంట్ నిరసనల వరకు ప్రతి అంశమూ కేంద్ర వర్సెస్ విపక్షాలుగా ప్రత్యక్ష రణరంగాన్ని తలపిస్తోంది. అయితే, దేశమంతటా ఈ స్థాయిలో రాజకీయ వేడి రగులుతుంటే.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం చిత్రమైన రాజకీయ నిశ్శబ్దం అలముకుంది. ఏపీలో కూడా ఎన్డీఏ శ్రేణుల పాలన నడుస్తుండటం, ప్రధాన ప్రతిపక్షంగా వైయస్సార్‌సీపీ ఉండటంతో జాతీయ స్థాయి అంశాలపై ఇక్కడ కూడా రాజకీయ సెగ రావలసి ఉంది. కానీ, ఆ స్థాయి ప్రతిస్పందన ఏపీ రాజకీయాల్లో కనిపించకపోవడం పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది.రాష్ట్రంలో విపక్ష హోదాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో నీట్ బాధితులు, విద్యార్థుల పక్షాన నిరసన ప్రదర్శనలు చేపట్టినప్పటికీ, ఏపీలో ఆ పార్టీకి ఉన్న పరిమిత బలమైన కేడర్, ఓటు బ్యాంక్ దృష్ట్యా ఆ ఆందోళనలు అధికార పక్షంపై పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. నిజానికి, వైయస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఇది ఓ అరుదైన రాజకీయ అవకాశం. రాష్ట్రంలో లక్షలాది మంది నీట్ అభ్యర్థులు, యువత ఆందోళనలో ఉన్న వేళ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను నిలదీస్తూ గళమెత్తి ఉంటే ప్రధాన ప్రతిపక్షంగా వైయస్సార్‌సీపీకి మైలేజీ వచ్చి ఉండేది. కానీ, వైయస్సార్‌సీపీ ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా విద్యార్థి పోరాటంలోకి దూకలేకపోయింది.ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ నాయకత్వం వహిస్తున్న ప్రతిపక్షాల సమరానికి జగన్ మద్దతు ఇవ్వకపోవడం వెనుక ఆయన సొంత రాజకీయ సమీకరణలు ఉన్నప్పటికీ, కనీసం స్వతంత్రంగా విద్యార్థుల హక్కుల కోసమైనా గళం విప్పకపోవడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. కాంగ్రెస్‌తో జట్టుకట్టడం ఇష్టం లేకపోయినా, యువత బహుళ ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ఈ అంశంపై క్షేత్రస్థాయిలో తిరుగుబాటు జెండా ఎగరేసి ఉంటే వైయస్సార్‌సీపీ మళ్లీ జనామోదాన్ని పొందేందుకు అది నైతిక బలాన్ని ఇచ్చేది. కానీ, జగన్ ధైర్యంగా ముందుకు రాకపోవడం వల్ల ఏపీలో అధికార కూటమికి ఎలాంటి విపక్ష నిరసనల సెగ తగలకుండా సురక్షితంగా బయటపడే అవకాశం లభించింది. జాతీయ స్థాయిలో నడుస్తున్న ప్రతిపక్షాల వేవ్‌ను తమకు అనుకూలంగా మలుచుకోవడంలో వైయస్సార్‌సీపీ నాయకత్వం చూపుతున్న 'అతి జాగ్రత్త వైఖరి వెనుక బలమైన కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంతో నేరుగా విభేదించడం వల్ల రాబోయే రోజుల్లో చట్టపరమైన సమస్యలు ఎదురవుతాయనే భయాలు వైయస్సార్‌సీపీ వైఖరిని నియంత్రిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఢిల్లీ పర్యటనల ద్వారా కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించేందుకు జగన్ యత్నించిన తీరు చూస్తే, ఆయన కేంద్ర అధికార పీఠంతో నేరుగా ఢీ కొట్టేందుకు అస్సలు సిద్ధంగా లేరని స్పష్టమవుతోంది.ఈ రక్షణాత్మక రాజకీయ ధోరణి వల్ల ప్రధానంగా నష్టపోతోంది వైయస్సార్‌సీపీ మాత్రమేనని చెబుతున్నారు. ఒక ప్రతిపక్షంగా ప్రజలు, యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై వీధుల్లోకి వచ్చి పోరాడటంలో విఫలమైనప్పుడు, ఆ రాజకీయ ఖాళీని ఇతర శక్తులు పూరించే ప్రమాదం ఉంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం నుంచి పార్టీ కేడర్‌ను తిరిగి సమీకరించడానికి, కొత్త ఉత్సాహాన్ని నింపడానికి నీట్ వంటి జాతీయ అంశం ఒక అద్భుతమైన రాజకీయ అస్త్రంగా ఉపయోగపడి ఉండేది. కానీ, ఆ అవకాశాన్ని వైయస్సార్‌సీపీ చేజేతులా వదులుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతిపక్షం నుంచి గట్టి ప్రతిఘటన లేదా రాజకీయ నిరసనలు లేకపోవడంతో, కూటమి ప్రభుత్వం తమ పాలనాజెండాను చాలా సులువుగా అమలు చేయగలుగుతోంది. ఒకవైపు దేశమంతటా విపక్షాలు కేంద్రాన్ని కుదిపేస్తుంటే, ఏపీలో మాత్రం ఎన్డీఏ ప్రభుత్వం ఎటువంటి రాజకీయ ఇబ్బందులు లేకుండా అత్యంత కంఫర్టబుల్ జోన్‌లో కొనసాగుతోంది.జాతీయ స్థాయిలో వస్తున్న అవకాశాలను అందుకోవడంలో, ప్రజా సమస్యలపై అగ్రెసివ్ మైలేజీ సాధించడంలో వైఎస్ జగన్ అనుసరిస్తున్న ఈ వెనకడుగు వైఖరి వైయస్సార్‌సీపీ భవిష్యత్ రాజకీయాలకు ప్రతిబంధకంగా మారే అవకాశం ఉంది. ప్రతిపక్ష హోదాలో ఉంటూ కూడా కేంద్రంతో లేదా అధికార కూటమితో తలపడటానికి వెనుకాడటం వల్ల పార్టీ మద్దతుదారుల్లో తీవ్ర నిరాశ నెలకొంటోంది. రాబోయే రోజుల్లోనైనా జగన్ తన రాజకీయ శైలిని మార్చుకుని, ప్రజల్లో ఉండే సమస్యలపై పోరాట బాట పడతారా లేక ఇదే సైలెంట్ స్ట్రాటజీని కొనసాగిస్తారా అనేది చూడాల్సి ఉంది.

# అవినీతి అనకొండే...




హైదరాబాద్, హైదరాబాద్‌లో ట్రాన్స్‌కో డీఈ ముత్యం వెంకటరమణపై ఏసీబీ దాడులు నిర్వహించి ఆదాయానికి మించిన ఆస్తులను భారీగా గుర్తించింది. 9 ప్రాంతాల్లో జరిగిన సోదాల్లో కిలోల కొద్దీ బంగారం.. భారీగా డబ్బు, విలువైన ఆస్తులు, కార్లు, కమర్షియల్ భవనాలు, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన పత్రాలు బయటపడ్డాయి. గతంలో లంచం కేసులోనూ అరెస్టైన వెంకటరమణను ఈసారి అక్రమాస్తుల కేసులో అరెస్ట్ చేశారు. ఈ సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాల ఆధారంగా ఏసీబీ అధికారులు మరింత లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు.తెలంగాణలో అవినీతి అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. దీంతో లంచాలు తీసుకుని అక్రమాస్తులు కూడబెట్టిన అధికారులు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ట్రాన్స్‌కో డిప్యూటీ ఇంజనీర్ (డీఈ) ముత్యం వెంకటరమణ.. ఏసీబీ అధికారులకు చిక్కారు. భారీగా అక్రమాస్తులు గుర్తించడంతో.. ఆయనను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. దాదాపు 12 గంటల పాటు సాగిన ఈ తనిఖీల్లో భారీ ఎత్తున అక్రమాస్తులు వెలుగులోకి రావడంతో వెంకటరమణను అధికారులు అరెస్ట్ చేశారు.ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ముత్యం వెంకటరమణ ఆదాయానికి మించి రూ.27.65 కోట్ల విలువైన ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఈ విలువ లెక్కించగా.. బహిరంగ మార్కెట్‌లో ఆస్తుల విలువ రూ. వందల కోట్లలో ఉండే అవకాశముందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు.ఈ ఏసీబీ అధికారుల సోదాల్లో 2 కిలోలకు పైగా బంగారు ఆభరణాలతోపాటు.. రూ.52 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు.. వజ్రాభరణాలు, విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు, విదేశీ మద్యం సీసాలు సీజ్ చేశారు. కియా, మహీంద్రా, బలెనో కంపెనీలకు చెందిన 3 కార్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.అంతేకాకుండా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి ప్రాంతాల్లో నివాస ఫ్లాట్లు, కమర్షియల్ భవనాలు, గుట్టల బేగంపేట్‌లో జీ+5 భవనం, మూసాపేట్‌లో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న 10 అపార్ట్‌మెంట్లతో పాటు ముత్యం వెంకటరమణ భార్య స్వప్న పేరుతో నిర్మాణ రంగంలో భారీ పెట్టుబడులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.ప్రస్తుతం రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (రెడ్కో)లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ముత్యం వెంకటరమణ.. గతంలో కూడా 2019లో లంచం కేసులో ఏసీబీకి చిక్కిన విషయం వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి ఆయనపై నిఘా కొనసాగించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పత్రాలు, బ్యాంకు ట్రాన్సాక్షన్లు, స్థిరాస్తుల రికార్డులను పరిశీలిస్తూ.. ముత్యం వెంకటరమణ అక్రమాస్తుల కేసులో మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

# సొంత పార్టీపై విమర్శలు...



హైదరాబాద్, బీజేపీకి ఆయన బద్ధుడైన నాయకుడే. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడం అంటే ఆషామాషీ వ్యవహారం కానే కాదు. కానీ గెలిచి చూపించిన రాజకీయ మొనగాడు రాజాసింగ్. గోషామహల్ ఎమ్మెల్యేగా 2014 నుంచి వరుసగా బీజేపీ గుర్తుతో గెలిచి వస్తున్న రాజా సింగ్ ని పార్టీ 2023 ఎన్నికల తరువాత సస్పెండ్ చేసింది. ఆయన కొన్ని విషయాల్లో సొంత పార్టీ మీదనే విమర్శలు చస్తున్నారు అన్న కారణంతో పక్కన పెట్టారు. అయితే ఏదో నాటికి ఆయన బీజేపీ గూటికి చేరుతారు అన్న ప్రచారం ఒక వైపు ఉండగానే రాజా సింగ్ ఏ మాత్రం తగ్గడం లేదు. తన అభిప్రాయాలను ఆయన కుండబద్దలు కొడుతున్నారు. ఆయన బీజేపీకి నిర్మాణాత్మకమైన సూచనలు ఇస్తున్నట్లుగానే అవి ఉంటున్నా అదే సమయంలో ఘాటైన విమర్శలుగా కూడా కనిపిస్తున్నాయి బీజేపీ తెలంగాణాలో అధికారంలోకి వస్తుందా అని రాజా సింగ్ ప్రశ్నించారు. ఆ ఇద్దరు నేతలు కలిస్తే ఏమి జరుగుతుందని ఆయన కీలక ప్రశ్నను సంధించారు. ఆ ఇద్దరు నేతలు ఎవరో కాదు కేంద్ర మంత్రి బండి సంజయ్ అలాగే మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్. ఈ ఇద్దరు నాయకులను తెలంగాణా బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి అభయ్ సింగ్ పిలిపించి చేతులు కలిపారు. విభేదాలు మరచి కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. దీంతో బీజేపీ తెలంగాణాలో తన వ్యూహాత్మకమైన అడుగులతో ముందుకు సాగుతోంది అన్న సంకేతాన్ని ఇచ్చినట్లు అయింది. ఇపుడు దానిని రాజా సింగ్ తప్పు పడుతున్నారు. ఇద్దరు నేతలు చేతులు కలిపితే బీజేపీ అధికారంలోకి వస్తుందా అని ఆయన నిలదీస్తున్నారు బీజేపీలో ఎంతో మంది సీనియర్ నాయకులు అలాగే కార్యకర్తలు ఉన్నారని ఆయన గుర్తు చేశారు. వారి సంగతి ఏమిటి అని కూడా ప్రశ్నించారు. అంటే పార్టీలో నాయకులందరినీ బీజేపీ ఇంకా కలుపుకొని పోవడం లేదన్న విమర్శ ఆయన మాటలలో కనిపిస్తోంది. అదే సమయంలో కార్యకర్తలకు ఉత్సాహం కలిగించేలా యాక్షన్ ప్లాన్ లేదని కూడా ఆయన చెబుతున్నట్లుగా ఉంది. నిజానికి బీజేపీలో ఇద్దరు కీలక నేతలు షేక్ హ్యాండ్స్ ఇచ్చుకున్నారు. విభేదాలు తగ్గాయి. ఇది మంచి సంకేతాలను ఇస్తుందని కమలనాధులు ఒక వైపు పొంగుతున్నారు. దాని మీద రాజా సింగ్ తన ఘాటు విమర్శలతో నీళ్ళు జల్లేశరు అని అంటున్నారు. .కమలం పార్టీ తెలంగాణాలో కదనోత్సాహంతో ఉంది. మూడు కార్పోరేషన్ల మేయర్ పదవులు గెలుచుకోవాలని పట్టుదలగా ఉంది. అలా తన సత్తా చాటాలని చూస్తోంది. అయితే బీజేపీ ఉత్సాహానికి గాలి తీసేశారు రాజాసింగ్ అంటున్నారు. మూడు కార్పోరేషన్ల మేయర్లు గెలవడం కాదు ముందు ఒక్క కార్పోరేషన్ లో అయినా సగం సీట్లు గెలిచి చూపించండి చాలు అని సవాల్ చేసేలా మాట్లాడారు. అంటే బీజేపీకి ఒక్క కార్పొరేషన్ గెలిచే అవకాశాలు లేవని రాజా సింగ్ తన ముందస్తు అంచనాను ఇలా బయటపెట్టారా అని చర్చ సాగుతోంది. అంతే కాదు ఆయన బీజేపీ ప్రస్తుత అధ్యక్షుడు రామచంద్రరావు మీద మీద కూడా కామెంట్స్ చేశారు. ఆయన చేతులు కట్టేశారని మరి ఎలా పనిచేస్తారు అని ప్రశ్నించారు ఒక వ్యక్తి కోసమే అధినాయకత్వం ఆలోచించే విధానాలు వద్దు అని హితవు పలికారు. మొత్తానికి దూరంగా ఉంటూనే కమలానికి కఠినమైన తీరులోనే సలహాలు సూచనలతో పాటు దిశా నిర్దేశం చేశారు రాజాసింగ్. దీనిని బీజేపీ అధినాయకత్వం ఏ విధంగా చూస్తుంది అన్నదే ఇపుడు చర్చ మరి.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TElTEL 2010/34557, Cell: 9849758280